ట్రాన్స్‌కో సీఎండీగా కృష్ణభాస్కర్

మొదటిపేజీ తరువాయి...

అధికారవర్గాల్లోనే ప్రచారం జరుగుతుండటం గమనార్హం.

విద్యుత్‌శాఖకు నాలుగోసారి..

అత్యంత కీలకమైన ట్రాన్స్‌కో సీఎండీగా కృష్ణభాస్కర్ నియమితులయ్యారు. కేవలం 11 నెలల కాలంలోనే అత్యంత కీలకమైన ట్రాన్స్‌కో సీఎండీ పోస్టులో నలుగురు అధికారులు మారారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలుత రిజ్వీ నియమితులయ్యారు. ఆయన కుదురుకునేలోగానే ప్రభుత్వం బదిలీ చేసి, ఆయన స్థానంలో రొనాల్డ్‌రోస్‌ను నియమించింది. కానీ ఆయన బాధ్యతలు చేపట్టిన స్వల్ప కాలంలోనే ఏపీ క్యాడర్‌కు వెళ్లిపోయారు. దీంతో సీఎండీగా సందీప్‌కుమార్ సుల్తానీయాకు అదనపు బాధ్యతలను అప్పగించారు. ప్రస్తుతం ఆయనను రిలీవ్ చేస్తూ కృష్ణభాస్కర్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శిగా కూడా అదనపు బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఐఏఎస్ అధికారి కృష్ణ ఆదిత్యను ఇంటర్‌బోర్డు డైరెక్టర్‌గా పోస్టింగ్‌నివ్వడమే కాకుండా టీజీఈడబ్ల్యూఐడీసీ వైస్ చైర్మన్, ఎండీగా అదనపు బాధ్యతలప్పగించారు. తొలుత ములుగు జిల్లా కలెక్టర్‌గా, పీసీబీ సభ్యకార్యదర్శిగా, కార్మిక శాఖ కమిషనర్‌గా నియమించారు.

పలువురు రెండేసి సార్లు..

ప్రస్తుతం బదిలీ అయిన ఐఏఎస్‌ల్లో ఏడాది కాలంలోనే రెండేసి సార్లు శాఖలు మారిన వారు ఉన్నారు. పర్యాటకం, సాంస్కృతిక , యువజన సర్వీసులశాఖ కార్యదర్శిగా స్మితా సబర్వాల్ నియమితులయ్యారు. ఆమె రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శిగానూ అదనపు బాధ్యతల్లో కూడా కొనసాగనున్నారు. రవాణాశాఖ కమిషనర్‌గా సురేంద్రమోహన్‌ను నియమించారు. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఈ శ్రీధర్‌ను బదిలీచేస్తూ.. దేవాదాయశాఖ కమిషనర్‌గా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. మహిళ, శిశు సంక్షేమం, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా అనితా రామచంద్రన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఇలంబరితి, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా సీహెచ్ హరికిరణ్, ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవోగా శివశంకర్, ఢిల్లీ తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా గౌరవ్‌ఉప్పల్, లేబర్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా సంజయ్‌కుమార్ నియామకమయ్యారు. ఈయన లేబర్ కమిషనర్‌గా కూడా అదనపు బాధ్యతల్లో ఆయన కొనసాగనున్నారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న చిట్టెం లక్ష్మిని ఆయూష్ డైరెక్టర్‌గా, ఐఏఎస్ సృజనను పంచాయతీరాజ్ అండ్ ఆర్‌అండ్‌బీ డైరెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

8 మంది ఐఎఫ్‌ఎస్ అధికారుల బదిలీ

చార్మినార్ సర్కిల్ సీసీఎఫ్‌గా ప్రియాంక వర్గీస్

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో ఎనిమిది మంది ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్‌ఎస్) అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. పీసీసీఎఫ్ కార్యాలయంలో చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ (ఐటీ, డబ్ల్యూపీ)గా పనిచేస్తున్న ప్రియాంక వర్గీస్ చార్మినార్ సర్కిల్ సీసీఎఫ్‌గా బదిలీ అయ్యారు. సిద్దిపేట డీఎఫ్‌వోగా పనిచేస్తున్న కే శ్రీనివాస్‌ను హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు.

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ప్రియాంక వర్గీస్	పీసీసీఎఫ్ కార్యాలయం (ఐటీ, డబ్ల్యూపీ)	చార్మినార్ సర్కిల్ సీసీఎఫ్
శివాల రాంబాబు	హైదరాబాద్ ఎస్‌టీసీ సర్కిల్	జోగులాంబ గద్వాల డీఎఫ్‌వో
డాక్టర్ సునీల్ ఎస్ హిర్మత్	క్యూరేటర్ నెహ్రూ జూపార్క్	హైదరాబాద్ జూపార్క్ డైరెక్టర్
పీ శ్రీనివాసరావు	ములుగు ఎఫ్‌సీఆర్ఐ డీసీఎఫ్	సిద్దిపేట డీఎఫ్‌వో
ఎస్‌వీ ప్రదీప్‌కుమార్ శెట్టి	హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్	హైదరాబాద్ ఎస్‌టీసీ సర్కిల్ డీసీఎఫ్
కే శ్రీనివాస్	సిద్దిపేట డీఎఫ్‌వో	హెచ్‌ఎండీఏ డైరెక్టర్
జే వసంత	భూపాలపల్లి డీఎఫ్‌వో	నెహ్రూ జూపార్క్ క్యూరేటర్
మందడి నవీన్‌రెడ్డి	జోగులాంబ గద్వాల డీఎఫ్‌వో	భూపాలపల్లి డీఎఫ్‌వో

ఎక్సైజ్ కమిషనర్‌పై బదిలీ వేటు

- సేల్స్ టార్గెట్ పూర్తికానందుకేనా?
- 11 నెలల్లోనే బదిలీపై జోరుగా చర్చ
- టార్గెట్ల వేట.. అధికారులే సమిధలు
- 19 జిల్లాల్లో తగ్గిన విక్రయాలు
- ఆదాయం పెంపునకు పీడిస్తున్న ప్రభుత్వ పెద్దలు

11 నెలల్లో సాధించిన మార్పు ఇదేనా?: హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఈ శ్రీధర్‌పై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. కేవలం 11 నెలల్లోనే ఆయనను బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోకపోవడం వల్లే ప్రభుత్వం ఆయనను బదిలీ చేసిందన్న వార్తలు వినిపిస్తున్నాయి. మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ. 37 వేల కోట్ల ఆదాయం సమకూరుతున్నది. ఇప్పుడీ లక్ష్యాన్ని ప్రభుత్వం రూ. 47 వేల కోట్లకు పెంచింది. దీనికి అనుగుణంగా ఎక్సైజ్ అధికారులు తమ కిందిస్థాయి సిబ్బందికి టార్గెట్లు ఇచ్చారు. అందులో భాగంగా ఒక్కో మద్యం దుకాణానికి రూ. 50 లక్షల టార్గెట్ విధించినట్టు తెలిసింది. ఆ మేరకు అమ్మకాలు పెంచడంలో విఫలమైన అధికారులకు ఇటీవల మెమోలు కూడా ఇచ్చారు.

ఆదాయం కోసమే బదిలీల ఆట

ఆదాయం కోసం కొందరు ప్రభుత్వ పెద్దలు ఆడుతున్న బదిలీల ఆటలో ఎక్సైజ్ కమిషనర్లు బలవుతున్నారు. గతంలో పనిచేసిన ముషారఫ్ అలీ ఫరూఖీ స్థానంలో ఈ శ్రీధర్‌ను తీసుకొచ్చారు. ఆయన కూడా ఆదాయం పెంచడంలో విఫలం కావడంతో బదిలీ వేటు పడింది. రాష్ట్రంలోని 19 జిల్లాలో మద్యం విక్రయాలు భారీగా తగ్గడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడింది. లక్ష్యాన్ని చేరుకునేలా ఎక్సైజ్ అధికారులను పరుగులు పెట్టించడంలో శ్రీధర్ విఫలమవుతున్నారని గుర్తించిన ప్రభుత్వం ఆయనను బీసీ శాఖకు బదిలీ చేసినట్టు చెప్తున్నారు. అధికారులకు అదనంగా లక్ష్యాలు విధించడం ద్వారా కనీసం 20 శాతానికి పైగా మద్యం విక్రయాలు జరుగుతాయని ఆశించారు. అయితే, ఆదాయం పెరగడానికి బదులు అమ్మకాలు మైనస్‌లోకి వెళ్లడంతో ఆగ్రహంగా ఉన్న ప్రభుత్వ పెద్దలు సోమవారం నాటి బదిలీల్లో శ్రీధర్ పేరును చేర్చారు. ఆయన స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న చెవ్వూరి హరికిరణ్‌కు బాధ్యతలు అప్పగించారు.

ఇదేనా 11 నెలల్లో సాధించిన మార్పు?

రాష్ట్రంలో మద్యం అమ్మకాలు పెంచుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుండడం, అధికారులకు మెమోలు ఇస్తుండటంపై మాజీమంత్రి హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. 'ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి మద్యం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడం సిగ్గుచేటు. మద్యం అమ్మకాల లక్ష్యాలను చేరుకోనందుకు 30 మంది ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మెమోలు జారీ చేయడం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలోని డొల్లతనాన్ని బయట పెడుతున్నది. మద్యం అమ్మకాలు అరికడతామని, బెల్టు షాపులను మూసివేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి ఇప్పుడు మద్యం అమ్మకాల పెంచాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లను ఒత్తిడి చేయడం ద్వంద వైఖరికి నిదర్శనం. ఎక్సైజ్ అధికారులు తమ సర్కిళ్లలో అమ్మకాలను 10 శాతం నుంచి 25శాతం పెంచాలని ప్రభుత్వం ఒత్తిడి చేయడం, విక్రయ లక్ష్యాలను చేరుకోకపోతే బదిలీ చేస్తామని బెదిరించడం దుర్మార్గం.ఆదాయం పెంచుకునేందుకు 1.7 లక్షల బెల్ట్ షాపులు విచ్చలవిడిగా పనిచేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహించడం శోచనీయం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 11 నెలలలో సాధించిన 'మార్పు' ఇదే!!' అంటూ ఎక్స్ వేదికగా హరీశ్ నిప్పులు చెరిగారు.

నేడు కోరుట్ల నుంచి జగిత్యాల వరకు రైతు పాదయాత్ర

- పాల్గొననున్న హరీశ్‌రావు

జగిత్యాల, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో అష్టకష్టాలు పడుతున్న రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం జగిత్యాలలో పాదయాత్ర నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు కోరుట్ల నియోజకవర్గ కేంద్రం నుంచి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో రైతులు జగిత్యాల జిల్లా కేంద్రం వరకు పాదయాత్రగా బయలుదేరనున్నారు. దాదాపు 25 కిలోమీటర్ల పాటు పాదయాత్ర నిర్వహించనున్నారు. జగిత్యాల సమీపంలోని చల్‌గల్ గ్రామ సమీపంలో పాదయాత్రకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంఘీభావం ప్రకటించనున్నారు. అనంతరం జగిత్యాల కొత్త బస్టాండ్ సమీపంలో సమావేశం నిర్వహించి, కలెక్టరేట్‌కు వెళ్లి వినతిపత్రం ఇవ్వనున్నారు.

చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న రైతులు

అన్నదాతల రాస్తారోకో

- ధాన్యం కొనాలంటూ గవ్వలపల్లి చౌరస్తాలో ఆందోళన

చిన్నశంకరంపేట, నవంబర్ 11: పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వివిధ పార్టీల నాయకులు ఆరోపించారు. సోమవారం మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల పరిధి గవ్వలపల్లి చౌరస్తాలో మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై ధాన్యం కొనుగోలు చేయాలని రైతులతో కలిసి వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేంద్రాలకు ధాన్యాన్ని తరలించి నెల రోజులు గడుస్తున్నా నిర్వాహకులు ధాన్యాన్ని తూకం వేయడం లేదని ఆరోపించారు. కొన్ని కేంద్రాల్లో సన్నరకం ధాన్యం తూకం ప్రారంభం కాలేదని, సన్నాలకు రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో పూర్తిస్థాయి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోతే ప్రభుత్వం కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. గంటపాటు నిరసన చేపట్టడంతో ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

ఎట్టకేలకు దిగొచ్చిన సీసీఐ

- జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో అధికారుల చర్చలు
- పాత పద్ధతిలోనే కొనుగోలుకు అంగీకారం
- మధ్యాహ్నం నుంచి మిల్లులను ప్రారంభించిన యాజమాన్యాలు

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్ల కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

హైదరాబాద్, నవంబర్ 11(నమస్తే తెలంగాణ)/న్యూస్ నెట్‌వర్క్: పత్తి కొనుగోళ్లు నిలిపేస్తామన్న జిన్నింగ్ మిల్లుల హెచ్చరికలతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) దిగొచ్చింది. సోమవారం ఢిల్లీ నుంచి నగరానికి వచ్చిన సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తా జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తమ సమస్యను సీఎండీ దృష్టికి తీసుకెళ్లిన మిల్లర్లు.. ఈ నిబంధనలను సడలించే వరకు పత్తి కొనుగోళ్లు చేపట్టబోమని స్పష్టంచేశారు. పత్తి కొనుగోళ్లలో కొత్తగా అమలు చేసిన ఎల్1, ఎల్2, ఎల్3 విధానాన్ని నిలిపివేసి పాత పద్ధతిలోనే ఒకేసారి అన్ని మిల్లుల్లో కొనుగోలుకు అంగీకరించారు. ఫలితంగా తమ నిరసనను విరమించుకుంటున్నట్టు మిల్లు యాజమాన్యాలు ప్రకటించాయి. మధ్యాహ్నం నుంచి అన్ని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు యథావిధంగా ప్రారంభమయ్యాయి.

రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన పత్తికి నిబంధనలు విధించడాన్ని నిరసిస్తూ తెలంగాణ కాటన్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా యజమానులు ఆందోళన చేపట్టారు. జిన్నింగ్‌లను మూసివేసి నిరసన తెలిపారు. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. ముందస్తు సమాచారం లేకుండా కొనుగోళ్లు నిలిపివేయడాన్ని నిరసిస్తూ రైతులు ఎక్కడికక్కడ ఆందోళనలకు దిగారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా, నిర్మల్ జిల్లా భైంసాలో రైతులు రోడ్డెక్కారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కాంటాలు నిలిచిపోవడంతో రైతులు మండిపడ్డారు.

రుణమాఫీ చేసే వరకు అప్పు కట్టపో!

మొదటిపేజీ తరువాయి...

ఉన్నదని, ప్రభుత్వం రుణమాఫీ చేసే వరకు బ్యాంకు అప్పు కట్టనని తేల్చి చెప్పారు. మరికొందరు రైతులు మాట్లాడుతూ.. బ్యాంకులో దళారులే రాజ్యమేలుతున్నారని ఆరోపించారు. పంట రుణాలు ఇవ్వడం, రెన్యువల్ చేయడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. రూ.2 లక్షలు దాటిన రైతులకు రుణమాఫీ ఎప్పుడు చేస్తారో చెప్పాలని పట్టుబట్టారు. ఆగస్టులో మాఫీ చేశామని ప్రభుత్వం ప్రకటించినా.. ఇప్పటివరకు డబ్బులు జమ కాలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సిబిల్ స్కోర్ లేదంటూ రుణం కోసం నెలల తరబడి బ్యాంకుల చుట్టూ తిప్పుకొంటున్నారని, దళారుల వద్దకు వెళ్తే పర్సంటేజ్ తీసుకొని పనులను క్షణాల్లో చేయిస్తున్నారని మండిపడ్డారు. డెయిరీఫాం ఏర్పాటుకు లోన్ ఇవ్వలేదని, అలిసిపోయి వదిలేసుకున్నామని గ్రామ యాదవ సంఘం నాయకులు సురేశ్ యాదవ్, శ్యాంసుందర్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులో ఏండ్ల తరబడి లావాదేవీలు చేసినా.. వ్యక్తిగత, వ్యాపార రుణం ఇవ్వడంలో ఏపీజీవీబీ విఫలం కావడంతో వేరే బ్యాంకులను ఆశ్రయించాల్సి వచ్చిందని వ్యాపారుడు బక్కయ్య తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల వారీగా దళారులను ఎంపిక చేసుకొని క్రాప్‌లోన్లు, రెన్యువల్ చేయించి ఫీల్డ్ ఆఫీసర్లు కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. దీంతో చేసేదేమీలేక బ్యాంకు అధికారులు నెమ్మదిగా జారుకున్నారు. ఈ సమావేశంలో ఏపీజీవీబీ చీఫ్ మేనేజర్ రమేశ్‌యాదవ్, ఫీల్డ్ ఆఫీసర్ సురేశ్ పాల్గొన్నారు.

వేధిస్తే సర్వే సక్రమంగా జరగదు: యూటీఎఫ్

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ) : కుల గణనలో క్రమశిక్షణా చర్యలు, షోకాజ్ నోటీసుల పేరుతో టీచర్లను బెదిరిస్తున్నారని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి ఆరోపించారు. ఇలా టీచర్లను వేధింపులకు గురిచేస్తే సర్వే సక్రమంగా జరగదని వారు అభిప్రాయపడ్డారు. కుల గణన సర్వే గడువును పొడిగించాలని డీటీఎఫ్ డిమాండ్ చేసింది. ఇండ్ల సంఖ్యను తగ్గించాలని, ఎన్యూమరేటర్లను పెంచాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి కోరారు.

ఇంటింటి సర్వేలో ఏదీ గోప్యత?

- గతంలో రోడ్లపై దర్శనమిచ్చిన ప్రజాపాలన అర్జీలు
- నేడు సోషల్ మీడియాలో ప్రత్యక్షమవుతున్న సర్వే ఫారాలు
- ఐచ్ఛికం అంటూనే వ్యక్తిగత, ఆస్తిపాస్తుల సమాచార సేకరణ
- ఇది రాజ్యాంగ విరుద్ధమని గతంలోనే తేల్చిన సుప్రీంకోర్టు
- పుట్టస్వామి కేసులో ప్రైవసీని ప్రాథమిహక్కుగా గుర్తిస్తూ తీర్పు

సర్వేలో వివరాలు సేకరిస్తున్న ఎన్యూమరేటర్

హైదరాబాద్, నవంబర్11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్న తీరు తమ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే విధంగా ఉన్నదని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఐచ్ఛికం అని చెప్తూనే ఎన్యూమరేటర్లు దబాయించి వివరాలు సేకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగం, చట్టాలు, సుప్రీంకోర్టు తీర్పులను సైతం తుంగలో తొక్కుతున్నాదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సేకరించిన సమాచారం గోప్యంగా ఉంటుందనే భరోసా లేకుండా పోయిందని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఆధార్ కార్డు అమలును సవాల్ చేస్తూ 2017లో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేఎస్ పుట్టస్వామి నడిపిన కేసులో గోప్యతను ప్రాథమిక హక్కుగా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. సుప్రీం తీర్పుకు విరుద్ధంగా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే కొనసాగుతున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ప్రజల వ్యక్తిగత గోప్యతను భంగపరుస్తున్నదని మేధావి వర్గం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నది. వ్యక్తిగత ఆస్తులు, ఆదాయ సమాచారాన్ని సేకరిస్తున్నదని అసహనం వ్యక్తంచేస్తున్నారు. సర్వేలో మొత్తంగా 75 ప్రశ్నలతో ప్రశ్నావళిని రూపొందించి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల, రాజకీయాలకు సంబంధించిన వివిధ అంశాల్లో సమాచారాన్ని ప్రస్తుతం సేకరిస్తున్న సంగతి తెలిసిందే. కుటుంబ యాజమానితో పాటు సభ్యుల వివరాలు, ఆధార్ నంబర్లను కూడా ప్రభుత్వం సేకరిస్తున్నది.

ఆదాయం, ఆస్తుల వివరాలు ఎందుకు?

ప్రభుత్వం సర్వే ఫారమ్‌లో ఐచ్ఛికం (చెప్పవచ్చు/చెప్పకపోవచ్చు) అని స్పష్టంగా తెలియజేసినా క్షేత్రస్థాయి ఎన్యూమరేటర్లు మాత్రం అందుకు విరుద్ధంగా బలవంతంగా అడిగి తీసుకుంటున్నారని ప్రజలు మండిపడుతున్నారు. పార్టు-2లోని ప్రశ్నలపై క్షేత్రస్థాయిలో తీవ్ర వ్యతిరేకతతోపాటు అనేక అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో కుటుంబ స్థాయికి సంబంధించిన మొత్తం 17 ప్రశ్నలు ఉండగా, వాటిలో ముఖ్యంగా భూమి వివరాలు సేకరించే క్రమంలో ధరణిలో నమోదైన పట్టా నంబర్, భూముల రకాలు (మెట్ట, తరి, పడావు), సాగు విస్తీర్ణం, నీటి వనరు, కౌలుభూమి, సాగు వంటి సమాచారంతో పాటు ఉపాధి, వార్షిక ఆదాయం, వ్యాపారులైతే వార్షిక టర్నోవర్, బ్యాంకు ఖాతా వివరాలు, అప్పులు, ఇతర ఆస్తులకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తున్నారు. అందుకు సంబంధించిన పత్రాలను కూడా చూపాలని ప్రజలను ఎన్యూమరేటర్లు కోరుతున్నారు. దీనిపై ప్రజల్లో తీవ్ర అభ్యంతరాలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమ వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడమేమిటని? ప్రశ్నిస్తున్నారు. రిజర్వేషన్ల పెంపు కోసమైతే ఆదాయ వివరాలు, ఆధార్ లెక్కలు ఎందుకని నిలదీస్తున్నారు.

ప్రైవసీపై భయాందోళనలు

ఇప్పటికే నిత్యం అనేక సైబర్ మోసాలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో తాజా సర్వేపై ప్రజల్లో ఆందోళన నెలకొన్నది. గోప్యతకు సంబంధించి సేకరిస్తున్న సమాచారం భద్రంగా ఉంటుందా? అనే అనుమానం పీడిస్తున్నది. తమ వ్యక్తిగత వివరాలను అడిగేందుకు ప్రభుత్వానికి హక్కేమున్నదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గతంలో ప్రజాపాలన పేరిట గ్యారెంటీల అమలు కోసం స్వీకరించిన దరఖాస్తులు హైదరాబాద్ బాలానగర్‌తో పాటు అనేకచోట్ల రోడ్లపైనే ప్రత్యక్షమయ్యాయని, ఇప్పుడు కూడా సర్వే ఫారాలు బయటకు వెళ్లవనే గ్యారెంటీ ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఆధార్, ఫోన్ నంబర్లు మాత్రమే కాకుండా, బ్యాంకు ఖాతాలు, ఆస్తులకు సంబంధించిన వివరాలను కూడా సేకరిస్తున్నారని, ఆయా వివరాలు సైబర్ మోసగాళ్ల చేతికి చిక్కితే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మేధావివర్గం, విద్యావేత్తలు ఆయా వివరాలను ఇచ్చేందుకు విముఖత చూపుతున్నారు. కానీ ఎన్యూమరేటర్లు బలవంతంగా వివరాలు, లేదంటే పథకాలు రాబోవంటూ బెదిరింపులకు దిగుతున్నారని గ్రామీణులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

సమగ్ర సర్వేకు సహాయ నిరాకరణ

- కులం పేరు లేదని తండావాసుల సర్వే నిలిపివేత



పెద్ద దేవిసింగ్ తండాలో స్థానికులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

పెద్ద కొడప్‌గల్, నవంబర్ 11: కామారెడ్డి జిల్లా పెద్ద కొడప్‌గల్ మండలం పెద్దదేవిసింగ్ తండావాసులు.. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను నిలిపేశారు. విషయం తెలిసి బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సోమవారం తండాకు వచ్చి స్థానికులతో మాట్లాడారు. సర్వేను ఎందుకు నిలిపేశారని, సర్వేకు సహకరించకపోతే నష్టపోతారని చెప్పారు. దీంతో తండావాసులు సర్వే ఫారంలో మథుర లంబాడా అని లేదని, మరి ఏ కులం పేరుతో సర్వే చేసుకోవాలని సబ్ కలెక్టర్‌ను ప్రశ్నించారు. ఫారంలో 240 కులాలు ఉన్నాయని, ఆ జాబితాలో తమ కులం ఎందుకు లేదని చెప్పారు. తమ జాతిని ప్రభుత్వం మరిచిపోయిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. జాబితాలో 240 కులాలను చేర్చినట్టే తమ కులాన్ని కూడా చేర్చి ఉంటే సర్వేకు సహకరించే వాళ్లమని స్పష్టంచేశారు. సర్వే ఫారంలో మథుర అని ఉందని, కానీ మథుర లంబాడా, కాయితీ లంబాడా, లబానా లంబాడా అని ఉంటే సర్వే చేసుకునే వారమని తెలిపారు. వేరే కులం పేరుతో సర్వేలో తమ వివరాలు నమోదుచేస్తే తమ కులమే తొలగిపోతుందని, ఇప్పటికే తమను ఎస్టీల జాబితా నుంచి తొలిగించడంతో తాము చాలా నష్టపోయామని ఆవేదన వ్యక్తంచేశారు. సర్వేకు సహకరించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి సర్దిచెప్పగా.. తండావాసులు వినిపించుకోలేదు. దీంతో ఈ విషయమై కలెక్టర్‌తో మాట్లాడుతానని చెప్పి ఆమె వెనుదిరిగారు.

సర్వే గడువు పెంచాలి

హైదరాబాద్, నవంబర్11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే గడువును పెంచాలని, ఆ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరావు, నవాత్ సురేశ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కులగణ సర్వేలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రోజుకు 6 నుంచి 8 కుటుంబాల సర్వే చేసేందుకు అనుమతిని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ల ఆదేశాలతో జిల్లాల్లో ఉపాధ్యాయులు మానసిక క్షోభకు గురవుతున్నారని వాపోయారు. ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులకు స్వేచ్ఛను ఇవ్వాలని, అప్పుడే సర్వే విజయవంతం అవుతుందని పేర్కొన్నారు. ఈ నెల 15న కార్తీక పౌర్ణమి రోజున ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు.

కులాల మధ్య చిచ్చుపెట్టేలా సర్వే

- మాజీ సీఎం నాదెండ్ల భాస్కర్‌రావు హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): సమగ్ర కుటుంబ సర్వే వల్ల గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉన్నదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదేండ్ల భాస్కర్‌రావు హెచ్చరించారు. కులగణన పేరిట ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని అసంతృప్తి వ్యక్తంచేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సర్వే చేయడానికి వెళ్లేవారు ప్రజల సందేహాలను తీర్చలేకపోతున్నారని చెప్పారు. సర్వే ఎందుకు చేస్తున్నారో కూడా చెప్పలేకపోతున్నారని పేర్కొన్నారు. సర్వే జరుగుతున్న తీరుపై ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

హైదరాబాద్ బతకొచ్చినోళ్లంతా పేదలే!

- రాజ్యంగ విరుద్ధంగా సమగ్ర కుటుంబసర్వే
- ఆస్తుల వివరాల సేకరణ హక్కుల హరణే
- నాడు వద్దని సీఎం ఇప్పుడెలా చేస్తున్నారు
- పేదలకు అన్యాయం జరగదని గ్యారెంటీ ఇస్తరా?
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

గతంలో ప్రతిపక్ష నేతగా రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల వీడియోను అధికారులకు చూపించి...మాటలను వినిపిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 11: ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌లో బతికేందుకు వచ్చిన వారందరూ పేదలేనని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. ఓ పేదవాడు ఓ బండి కొనుక్కొని నెలకు రూ.40,000 సంపాదిస్తే ధనవంతుడు అవుతాడా? అని ప్రశ్నించాడు. నగరంలో నివసిస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని తన ఇంటికి సోమవారం వచ్చిన కులగరణ సర్వే ఎన్యూమరేటర్లతో ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సకల జనుల సర్వే సమయంలో నాడు ఎమ్మెల్యేగా ఆస్తులు, ఖాతాల వివరాలు సేకరించొద్దన్న రేవంత్‌రెడ్డి, ఈనాడు అవే వివరాలను సమగ్ర కుటుంబ సర్వేలో ఎందుకు సేకరిస్తున్నారని కృష్ణారావు ప్రశ్నించారు. సర్వే పేరుతో పేదలకు ఇబ్బంది జరిగితే.. బీఆర్‌ఎస్ పార్టీ సహించబోదని, వారికి అండగా ఉంటుదని చెప్పారు. ఉన్నత కులాలతోపాటు మైనార్టీ వర్గాల్లోనూ పేదలున్నారని, వారికీ మేలు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. అలాంటి వారికి అన్యాయం వారి పక్షాన పోరాడుతానని స్పష్టం చేశారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన గోప్యత హక్కులకు విరుద్ధంగా ఆస్తులు, అంతస్తులు, వాహనాలు తదితర స్థిర చరాస్తుల వివరాలను ప్రభుత్వం ఎలా సేకరిస్తుందని ప్రశ్నించారు. కులగణన పేరుతో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని చెప్పారు. సర్వే పేరుతో సంక్షేమ పథకాలు కోల్పోయి పేదలకు అన్యాయం జరిగితే అధికారులు గ్యారెంటీ ఇస్తరా? అని నిలదీశారు.

తప్పుడు సమాచారం సేకరించొద్దు?

కూకట్‌పల్లి నియోజకవర్గంలో 4.75 లక్షల మంది ఓటర్లు, 2.70 లక్షల ఇండ్లు ఉన్నాయని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వివరించారు. హడావుడిగా సర్వే చేసి తప్పుడు సమాచారం సేకరించొద్దని హితవు పలికారు. పేదల ఇండ్లలోకి దౌర్జన్యంగా వెళ్లి సర్వే పేరుతో వివరాలు సేకరించడం సరికాదని సూచించారు. ప్రజలకు ఉన్న అనుమానాలను నివృతి చేయాలని, ప్రజల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. తన వివరాలు ఎన్నికలప్పుడు సమర్పించిన నామినేషన్ పత్రంలోనే ఉన్నాయని, మళ్లీ ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించారు.